# కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మొద్దు

- ఆపార్టీలకు ఓటు వేస్తే కరెంట్ కట్..
- మరింత అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- మాక్లూర్ మండలంలో ప్రజా ఆశీర్వాదయాత్ర



ఒడ్యాట్‌పల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



డొంకేశ్వర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి



మచ్చర్ల గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

మాక్లూర్, నవంబర్ 14: కాంగ్రెస్, బీజేపీల నాయకుల మాటలు నమ్మి వారి మాయలో పడొద్దని, ఆపార్టీలకు ఓటు వేస్తే కరెంట్ కట్ అవుతుందని, సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని బీఆర్ఎస్ ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని సట్లాపూర్ తండా, మదన్‌పల్లి, ఒడ్డెట్‌పల్లి, అమ్రాద్‌తండా, ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాల్లో జీవన్‌రెడ్డి ప్రజాశీర్వాద యాత్ర నిర్వహించారు. ప్రజలు జీవన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. అమ్రాద్ తండా, ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలంతా వెంట రాగా ఆయన గ్రామమంతా కలియతిరిగి ప్రతిఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే మళ్లీ తనను గెలిపించాలని కోరారు. అనంతరం సట్లాపూర్ తండా, మదన్‌పల్లి, వొడ్యాట్‌పల్లి, అమ్రాద్ తండా, ముత్యంపల్లి, అమ్రాద్ గ్రామాల్లో ప్రజాశీర్వాద సభలో పాల్గొన్నారు. కేసీఆర్ సబ్బండ వర్గాల ఆత్మబంధువు. 'మా తండాలో మా రాజ్యం' అన్న నినాదం సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. ఆర్మూర్‌ను రెవెన్యూ డివిజన్, ఆర్మూర్‌కు 100 పడకల దవాఖాన, అభివృద్ధి ఉట్టి పడేలా 11 బైపాస్ రోడ్లు, సిద్ధుల గుట్టకు రూ.20కోట్లకు పైగా ఖర్చు పెట్టి ఘాట్ రోడ్డు, ఉమ్మెడ-పంచగూడ బ్రిడ్జి నిర్మాణం, ఆర్మూర్ పట్టణ ప్రతిష్టను చాటేలా అర్బన్ పార్కు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తనను మళ్లీ దీవించాలని, మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆసరా పెన్షన్లు రూ.5 వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ6 వేలకు, రైతు బంధు ఎకరా రూ.10వేల నుంచి రూ.16 వేలకు పెరుగుతాయి. సౌభాగ్యలక్ష్మి పథకంతో మహిళలకు నెలకు రూ.3 వేల భృతి వస్తుందని, రూ.400కే వంటగ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని, రూ.5లక్షల చొప్పున కేసీఆర్ బీమా పథకం అమలు చేస్తామని అన్నారు. ఆర్మూర్ ప్రజల ఆశీస్సులు తనకే ఉన్నాయని, హ్యాట్రిక్ విజయంతో సత్తా చూపిస్తానని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు సత్యం, విండో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజేశ్వర్, రజనీశ్, అశోక్, రంజిత్, శ్రీనివాస్, సర్పంచులు శ్రీసుధ, శంకర్‌గౌడ్, లింగన్న, కిషన్‌నాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### దేగాం, మచ్చర్ల గ్రామస్తులతో జీవన్‌రెడ్డి చిట్‌చాట్

ఆర్మూర్, నవంబర్14: ఆలూర్ మండల కేంద్రంతో పాటు ఆ మండలంలోని దేగాం, మచ్చర్ల గ్రామాల్లో మంగళవారం ఉదయం ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. గ్రామంలోని హోటళ్లు, ప్రధాన కూడళ్లలో ప్రజలతో ముచ్చటించారు. ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ కుశల ప్రశ్నలు వేశారు. వృద్ధులను కలిసి పింఛన్ వస్తుందా.. అని అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో రూ.5వేలు అందజేస్తామని, కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఉదయం హోటల్‌లో ప్రజలను కలిసి వారితో కలిసి టీ తాగుతూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులపై చర్చించారు. రైతులను కలిసి రైతు బంధు పథకంపై చర్చించారు. మచ్చర్ల గ్రామానికి చెందిన ఆర్మూర్ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ భోజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆయన వెంట ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సంజయ్‌సింగ్‌బబ్లూ ఉన్నారు.

### ఇంటింటా జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ప్రచారం

నందిపేట్, నవంబర్ 14: డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడ, అన్నారం, సిర్పూర్ గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



నందిపేట్ మైనార్టీ యువకులకు గులాబీ కండువా కప్పుతున్న జీవన్‌రెడ్డి

నందిపేట్, నవంబర్ 14: మండల కేంద్రంలోని రాజానగర్, దుబ్బ ప్రాంతానికి చెందిన సుమారు 200 మంది మైనార్టీ యువకులు పెద్ద సంఖ్యలో మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు మైనార్టీ యువకులు తెలిపారు.

**అమ్రాద్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు..**

ఆర్మూర్, నవంబర్14: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో మాక్లూర్ మండలంలోని అమ్రాద్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొర్ర నందకుమార్, గంగరత్నం తన అనుచారులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని, గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని జీవన్‌రెడ్డి సూచించారు. సర్పంచ్ లింగన్న, విండో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు జలంధర్, మురళి, పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డి గెలవాలంటూ ప్రార్థనలు

ఆర్మూర్, నవంబర్14: ఎన్నికల్లో ఆర్మూర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆశన్నగారి జీవన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవాలంటూ మంగళవారం ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని జీవన్‌రెడ్డి నివాసంలో పాస్టర్లు, క్రిస్టియన్లు ప్రార్థనలు నిర్వహించారు. జీవన్‌రెడ్డి గెలుపునకు ఆటంకాలు కలుగకుండా యేసుప్రభు అండగా ఉండాలని ప్రార్థించారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్

# పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆర్మూర్, నవంబర్14: ఆర్మూర్ మండలంలోని చేపూర్, ఫత్తేపూర్, పిప్రి, మంథని, రాంపూర్, ఇస్సాపల్లి, అంకాపూర్ , మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నిక పరిశీలకుడు సుబ్రా చక్రవర్తి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తిరిగి పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఓటింగ్‌లో పాల్గొనే ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి సరైన మౌళిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఆర్మూర్ తహసీల్దార్ గుండు అళ్వార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్‌సింగ్ ఉన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

# నాలుగు నామినేషన్ల ఉపసంహారణ

ఆర్మూర్‌టౌన్, నవంబర్14: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ వేసిన వారిలో మంగళవారం నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ అభ్యర్థి బొంత సాయన్న, స్వతంత్ర అభ్యర్థులు బి.భూమన్న, సీ.అశోక్, ఎస్.సుధాకర్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆర్మూర్‌టౌన్, నవంబర్14: ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ మానస అన్నారు. పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ.. ఇంట్లో ఉన్న పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వాటిలోనే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దాంతో డెంగీ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. విద్యార్థులు కాళ్లు, చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జిలాని, పట్టణ పర్యవేక్షకుడు చంద్రశేఖర్, సబ్‌యూనిట్ అధికారి సాయి, హెల్త్ అసిస్టెంట్లు ఆనంద్, మోహన్, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు

## ఘనంగా బాలల దినోత్సవం

ఆర్మూర్, నవంబర్14: బాలల దినోత్సవాన్ని మంగళవారం ఆర్మూర్ పట్టణం, ఆర్మూర్, ఆలూర్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలతో పాటు, ఆర్మూర్ మండలం చేపూర్ పరిధిలోని క్షత్రియ పాఠశాల్లో నిర్వహించారు. బాలలు నెహ్రూ వేషధారణలో అలరించారు. శ్రీచైతన్య పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**విజయ్‌హైస్కూల్‌లో..**

ఆర్మూర్‌టౌన్, నవంబర్14: పట్టణంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విజయ్‌హైస్కూల్‌లో విద్యార్థులు నెహ్రూ వేషధారణతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.